# చేరువైన గమ్యం

వాచస్పతి

క్రమంలో అమర్చి. ఉదాహరణలతో సహా వ్రాసిపెట్టేవారు తను ఒకటీ రెండు సార్లు చదువుకుని వెళ్ళేది కానీ యీ రోజు తనే వ్రాసుకోవలసివస్తోంది

ఎందుకనో రమ్మని ఒక్క ఉత్తరమైనా వ్రాయలేదు అంతఇంట్లో ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ ఏం తోస్తుంది పాపం !

తిరిగివెళ్తూ లలిత వచ్చింది గాబోలు ఈసారి ఏమేం చెప్పిందో ? అందులోనూ తనూ దగ్గర లేదాయె ఇక లలిత నోటికి ఓ అడ్డంటూ ఉండనే ఉండదు.

ఒక రాత్రి, ఒకే ఒక రాత్రి తను ఇంట్లో లేకపోవడం ఎన్ని అనర్ధాలకు, అపార్ధాలకు, అనుమానాలకు దారి తీసింది ?

ఎంత చదువుకున్నా, సంస్కారమున్నా, ఉద్యోగం చేసినా, రాజ్యమేలినా, స్త్రీని ప్రపంచం నమ్మదు గాబోలు !

తన గౌరవం, తన భర్త గౌరవం, తన ఇంటి గౌరవం కాపాడుకోవడం స్త్రీకి తెలీదా ?

కేవలం చపలత్వమేనా స్త్రీ ?

తనమీద సాగుతున్న దుష్ప్రచారం చంద్రశేఖరంవరకూ చేరినట్లుంది.

లేకుంటే చంద్రశేఖరం అలా మాట్లాడేందుకు ఆస్కారమెక్కడుంది ?

కానీ తన బాధల్లా వారి కోసమే

మనసు అసలే సున్నితం ఇలాంటి తాకిడికి అసలు ఓర్చుకోలేదు ఒంటరిగా కూర్చుని బాధతో విలవిలలాడి పోతుంటారు పోనీ తిరిగి వెళ్ళిపోదామన్నా వదిన ముందు చులకన కాక తప్పదు అసలు వదినా అన్నయ్యా పంపరు కూడా అసలు విషయం వదినతో చెప్పడం తనదే పొరపాటు

అయినా తన తెలివితక్కువ తనం కాకుంటే లలిత మాటలకు తను రోషపడి రావడ మేంటి ?

అన్నయ్య ఆరోజు ఉగ్రుడై పోయాడు వదిన సరేసరి ఏడ్చినంత పని చేసింది. కోపంలో అన్నయ్య లలితను తిడ్తుంటే తను వినలేకనూ పోయింది, వారించ లేకనూ పోయింది

అన్నయ్యకూ వొదినకూ తను తప్పు చేస్తుందనిగానీ, కనీసం తను తొందరపడి నట్లు గానీ — అనిపించకపోవడం సహజమే

తన హృదయంలోని భావా లేమిటో అసలు ఒక్కోసారి తనకే అర్థం కావు ; చిన్ననాటినుండీ తన హృదయంలో ప్రగాఢంగా నాటుకుపోయిన ఆశలకు, ఆశయాలకూ యీనాటికీ రూప కల్పన జరగనేలేదు

జీవితంలో ఉజ్వలంగా వెలిగిపోవా లనుకున్న తను ..ప్చ .

సంఘ సేవకే తన జీవితం అంకితం చెయ్యాలని నిర్ణయం కానీ అడుగడుగునా అడ్డంకులే అర్థం చేసుకునేవారు కనిపించడమే లేదు

చెయ్యా లనుకున్న దేదీ చెయ్యలేక పోవటం — ఏదో అసహాయమైన స్థితి — అవ్యక్తమైన ఆవేదన — జీవిత గమ్యాన్ని చేరుకోలేక పోయా నన్న నిరంతర తీవ్ర వేదన —

హృదయాన్ని ప్రతి క్షణం పట్టి పీడిస్తూనే ఉన్నాయి

ఎందుకనో పదే పదే వందన గుర్తు కొస్తోంది వందన ఇప్పు డెక్కడుందో తెలీదుగానీ. మొదటి సంవత్సరం కాలేజీలో కలిసింది, ఎమ్ ఏ వరకూ తనతో పాటే చదువుకుంది తమ పరిచయం గాఢ స్నేహంలోకి కాకున్నా మంచి స్నేహంగా మారిందనే చెప్పొచ్చు

వందన నిరాడంబరం, మితభాషిత్వం విశాల దృక్పథం చూసి ముచ్చటవేసేది ఉదయం సాయంత్రం ట్యూషను చెప్పేది ఎప్పుడూ తెల్లని, చౌకబారు, నేత

చీరలు కట్టేది మెడా, చెవులూ, చేతులూ ఎప్పుడూ బోసిగానే ఉండేవి విశాల మైన ఫాల భాగం మీద మామిడిచిగురు రంగు కుంకుమ నయాపైసంత సైజులో కళకళ లాడ్తూ ఉండేది

చిన్న కళ్ళయినా ఆ కళ్ళలో ఏదో వెలు గుండేది తెలివితేటలూ, వ్యుత్పత్తీ, ప్రతిభా ఉన్న వందన మామూలుగానే పాసయింది ఎమ్ ఏ లో ! తనకు మటుకు క్లాసొచ్చింది !

తనకు చెప్పలేనంత ఆశ్చర్యం కలిగింది కారణాలు గాలించింది

ఆరోజు వందన నవ్వి - అన్న మాటలు - యీ క్షణంలో తనముందు నిల్చి చెప్పినట్లే అనిపిస్తుంది

"కారణాలు ఎన్నో ఉంటాయి సరితా ! వాటితో పనేమిటి ? నేను వెళ్ళబోయే పనికి క్లాసుతో పనిలేదు కావలసింది ఆత్మ ధైర్యం, సంతృప్తీ, నా ఆశయ సిద్ధికి కావలసిన బలమూ, సహనమూ అంతే !"

తన ఆశ్చర్యానికి అవధులే లేకపోయాయి

మొన్ననే ఎవరో చెప్పగా వింది — వందన మద్రాసులో ఏదో ఆశ్రమంలో పని చేస్తుందని

వందనకున్న ఆత్మ విశ్వాసమూ, లక్ష్య సిద్ధికి కావలసిన సహనమూ, పట్టుదలా తనకు లేవని అనిపిస్తుంది

తను లక్షలకు అధికారిణి అయినా సంతోషంలేదు, సంతృప్తి లేదు గమ్యంలేని జీవితం కాకున్నా గమ్యాన్ని చేరుకోలేకపోతూంది

"పుస్తకాలు ముందేసుకుని అలా ఆలోచనలో పడిపోయా వేమిటి ?" ఏ దో పుస్తకంకోసం వచ్చిన రమణమూర్తి ఆశ్చర్యపోయాడు.

"ఉపన్యాసం ఎలా మొదలుపెడ్తే బాగుంటుందీ అని !" ఆలోచనలనుండి తేరుకుని అబద్ధమాడింది

"సాయం కావాలన్న మాట ?" నవ్వుతూ కుర్చీలో కూర్చుని అడిగాడు.

"అంతకన్నానా !"

అంతలో శైలజ సరితాదేవిని వెతుక్కుంటూ వచ్చింది అక్కడికే.

"మొదట అనాథ అంటే ఎవరో అర్థం చెప్పాలి" సిగరెట్ వెలిగించి అడిగాడు

"దిక్కులేని వాళ్ళు"

"తల్లీ దండ్రీ లేనివాళ్ళని.. అంతేనా ?"

"పోనీ అలాగే అనుకుందాం"

"తల్లీ దండ్రీ ఏమైపోయారని ?"

"చనిపోయి ఉండొచ్చు ప్లీడరు ప్రశ్నలు బాగున్నాయి !" శైలజ ఫకాల్ను నవ్వి అంది

"అదో రకం ..యింకోరకమూ ఉన్నారు''

''ఏవిటిది ? స్కూలు మాస్టర్లా నీ ప్రశ్నలూ నువ్వూనూ !" సరితాదేవి కాస్త విసుక్కుంది

"మరి ప్రశ్నలు వెయ్యందే జవాబు లెలా వస్తాయి ?"

''అమ్మా నాన్నా ఉండీ వాళ్ళ ప్రేమకూ ఆదరణకూ దూరం కాబడిన వాళ్ళు రెండో రకం'' బాధగా అంది సరితాదేవి

"సరిగ్గా చెప్పావు ఈమధ్య యీ రెండోరకమే ఎక్కు వవుతున్నారు ''

''స్టాటిస్టిక్స్ గానీ తీసారేంటి ?" నవ్వుతూ అంది శైలజ.

''పేపర్లలో చదువుతున్నాంగా ? తండ్రెవరో తెలీదు తల్లి కని అవతల పడేస్తుంది ఇంతకన్నా రాక్షసత్వం మరేముంది ?''

"ఆర్థికంగా, సాంఘికంగా స్త్రీకి బలంలేని రోజుని అంతకన్నా ఏం చెయ్యగలదన్నయ్యా !'' భగవంతునిచేతా, సంఘంచేతా చిన్నచూపు చూడబడి అన్యాయాన్నీ, బాధనూ నోరెత్తక భరిస్తున్న స్త్రీజాతి హృదయాల్లోని మూగవేదన సరితాదేవి తప్త కంఠంలోనుండి వెలువడినట్లయింది

అందుకనే రమణమూర్తీ, శైలజా తలెత్తి సరితాదేవి ముఖంలోకి ఓ క్షణం పాటు చూస్తుండిపోయారు.

"అనాథల కోసం ఆశ్రమాలను అభివృద్ధిచేసే దానికన్నా అనాథలు లేకుండా చేసేందుకు ప్రయత్నించడం మంచిది ప్రివెన్షన్ యీజ్ బెటర్ దేన్ క్యూర్'' యాష్ట్రేలో సిగర్ నుసి రాలుస్తూ అన్నాడు

"నిజమే ! కాదని ఎవరంటారు ?'' సాలోచనగా అంది సరితాదేవి


''అయితే అదెలా సాధ్యపడుతుంది ?" కుతూహలంగా ప్రశ్నించింది శైలజ,

"నేటి సామాజిక, ఆర్థిక వ్యవస్థలు పూర్తిగా మారిపోయిన రోజు 'అనాథ' అనే పదాన్ని మనం డిక్షనరీ నుండి తీసివెయ్యొచ్చు "

"ఎలాగ ?''

"నవమాసాలు మోసిన కన్నతల్లి తన అనురాగాన్ని బిడ్డకు దూరం చేస్తుంది. ఎందుకు ?''

"సమాజం ఊరుకోదు గనక'' శైలజ చెప్పింది



"నీకు లక్ష రూపాయిలు కావాలా ? 5 మంది ఆడపిల్లలు కావాలా ?"

"5 మంది ఆడపిల్లలు "

"ఏం ?"

"లక్ష రూపాయిలుంటే ఇంకో లక్ష సంపాదించ బుద్ధేస్తుంది 5 మంది ఆడపిల్లలు ఉంటే ఉన్నదానితో సంతృప్తి చెందుతాం, అది "

---

"ఇం కేకారణం లేదా ?"

"ఆర్థికమైన చిక్కులు "

"ముఖ్యమైన కారణం అదే. అలా కాక స్త్రీకే ఆస్తిమీద హక్కు వున్నట్లయితే ?"

"అంటే యిప్పుడు పురుషుని కున్న స్థానం స్త్రీకివ్వా లన్నమాట ?"

"అవును ఆరోజు తల్లి బిడ్డను దూరం చేసుకోదు "

"కావొచ్చు కానీ యీ పద్ధతి నాకేం నచ్చలేదు" శైలజ నిష్కర్షగా చెప్పేసింది

"నీకు నచ్చినా నచ్చకున్నా ఈ పద్ధతి ఒకప్పుడు ఉండేది చరిత్రలో మనం అలా చదువుకోలేదా సరితా ?"

"అందులో కష్టనష్టా లుండబట్టే రూపుమాసిపోయింది ఏ వ్యవస్థ విశ్వ శ్రేయస్సుకూ, మానవ కళ్యాణానికీ తోడ్పడుతుందో అది ఎన్ని తాకిడులకైనా తట్టుకుని నిలబడగలదు" అంది శైలజ

శైలజ ఎక్కువగా ఏం చదువుకోలేదు ఐదో తరగతి వరకూ చదివి మానే

పింది. పద్దెనిమిదో ఏట రమణమూర్తితో పెండ్లయింది. రమణమూర్తి సహచర్యంతో ఆమె మేధస్సూ హృదయమూ వికాసం చెందాయి

"వివాహ వ్యవస్థను గురించేగా నువ్వు చెప్పడం ?'' అన్నాడు రమణమూర్తి.

"అవును ''

''అది సామాజిక వ్యవస్థ కాక వ్యక్తిగతంగా మార్తే బాగుంటుంది ''

"అంటే యిష్టముంటే చేసుకోవడం, లేకుంటే మానేయడం ?" కోపంగా అంది శైలజ

"అవును'' నిశ్చలంగా అన్నాడు రమణమూర్తి

"అది బాగానేఉంది కానీ అయితే దానివల్ల విపరీతమైన నష్ట ముందన్నయ్యా''' సాలోచనగా అంది సరితాదేవి

"ఏమిటి ?''

"వివాహ వ్యవస్థ లేని రోజు ఒకే తండ్రికి జన్మించిన సంతానంలో తిరిగి సంపర్కం జరిగేందుకు అవకాశ ముంది అప్పుడు జాతి క్షీణించి పోయేందుకు ఎక్కువ అవకాశ ముంది "

''ఒకే కుటుంబంలో వివాహాలు చేసుకుంటున్న జాతులు అనేక మున్నాయి దానివల్ల ఏ జాతీ క్షీణించి పోవడంలేదే ?''

"మరి విజ్ఞాన శాస్త్రం . "

''అదే అదే " అంటూ ఆలోచనలో పడిపోయాడు

''మన సాంప్రదాయమూ, సంస్కారమూ, ముఖ్యంగా మన మనసూ అందుకు ఒప్పుకోవు'' శైలజ అంది

"నిజమే" సరితాదేవి పుస్తకం తిరగేస్తూ అంది

"ఇంతకూ నీ ఉపన్యాసంలోని సారాంశం ?" శైలజ సరితాదేవి ముఖంలోకి చూస్తూ ప్రశ్నించింది

"ఏముంది ? క్షణికోద్రేకానికీ, ఆవేశానికీ లోనై అనాథలను అభివృద్ధి చేయ వద్దని యువతీలోకానికి ఒక విన్నపం చేసుకుంటాను ''

"బాగుంది కానీ ఉన్నవాళ్ళ నుద్ధరించడం ?"

"మీలాంటి లక్షాధికారులు దయ చూపితే అదెంత ?'' నవ్వుతూ రమణమూర్తి ముఖంలోకి చూసి అంది సరితాదేవి

రమణమూర్తి పెద్దగా నవ్వి – ''చంద్రశేఖరం నన్ను వొదిలిపెట్టేటట్టు లేడులే ! అంతో యింతో ముట్టచెప్పాల్సిందే !"

"భోజనానికి టైమైంది ఇక లేస్తారా ?" శైలజ కుర్చీలోనుండి లేస్తూ అంది

ముగ్గురూ డైనింగ్ హాలు వేపు నడచారు

ఇరవై ఆరో తేదీని సరితాదేవి మరచిపోలేదు సాయంత్రం ఐదుగంటలకల్లా శైలజా, రమణమూర్తీ, సరితాదేవీ అనాధాశ్రయం చేరుకున్నారు

అనుకున్నదానికంటే గూడా సరితాదేవి చాలా చక్కగా మాట్లాడింది సరితాదేవి మాట్లాడినందువల్లే చందాలు ఎక్కువ వసూలైనట్లు చంద్రశేఖరం తర్వాత చెప్పాడు కూడా

సరితాదేవి మాట్లాడిన తర్వాత నృత్యనాటిక ఒకటి ప్రదర్శించారు సరితాదేవి మాట్లాడి వేదిక దిగి రాగానే చంద్రశేఖరం తన ప్రక్కనున్న కుర్చీ చూపి ఆహ్వానించాడు

రాధిక అనే బాలిక చేసిన నృత్యం అందరి హృదయాలను ఉయ్యాల లూపింది. ఆ ఉత్సాహంలో చంద్రశేఖరం సరితాదేవి చేతిని గట్టిగా నొక్కాడు

సరితాదేవి హృదయం ఆశ్చర్యంతోనూ, కోపంతోనూ కొన్ని క్షణాల పాటు మూగవోయింది చేతిని విసురుగా లాక్కుని చంద్రశేఖరం వేపు కొరకొరా చూసింది

"ఓ ! సారీ !'' అంటూ తిరిగి నాట్యం చూడ్డంలో మునిగిపోయాడు

సరితాదేవి ఆలోచనలు పరిపరివిధాల పోయాయి ఏమిటితని ప్రవర్తన ? తనమీద ఏదో తేలిక భావం ఏర్పరచుకొన్నట్లుంది ఎంత ఉత్సాహం కలిగినా తన చేతిని నొక్కే టంతటి సాహసం ఎలా కలిగింది ? ఏమో .తన అనుమానం గానీ ..ఒక వేళ ఉద్దేశపూర్వకంగా చేసిన పని కాదేమో ? చంద్రశేఖరం విషయంలో జాగ్రత్తగా ఉండడం ఎందుకయినా మంచిది

ఆ తర్వాత సరితాదేవి గానీ, చంద్రశేఖరం గానీ ఒక్క మాటా మాట్లాడుకో లేదు చివరన చంద్రశేఖరం చెప్పిన వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది

సరితాదేవీవాళ్ళను సాగనంపను చంద్రశేఖరం వెనకే వచ్చాడు అంత శ్రమ తీసుకుని వచ్చి, అంత చక్కగా మాట్లాడినందుకు సరితాదేవికి హృదయపూర్వక ధన్యవాదాలు అర్పించాడు

"మా ఆశ్రమం అంతా చూడనేలేదు రేపు తప్పక రావాలి" కారెక్కుతున్న సరితాదేవితో అన్నాడు

"చూద్దాంలెండి !" కారు తలుపు వేస్తూ అంది

"చూసేది లేదు తప్పక రావాలి" అన్నాడు కారు కదలి పోయింది

అనాధాశ్రమం వార్షికోత్సవం జరిగి పది రోజులకు పైగా అయింది. చంద్రశేఖరం ఆహ్వానాన్ని సరితాదేవి మర్చిపోలేదు గానీ, అయితే వెళ్ళడం మటుకు జరగలేదు ఆశ్రమాన్నీ, పిల్లల్నీ చూడాలని ఉన్నా, చంద్రశేఖరం చొరవా, మాటలతీరూ ఆమెను భయపెట్టినమాట మటుకు నిజం అందుకనే ఏరోజు కారోజు 'రేపు' వెళ్లొచ్చులే అని వాయిదా వేస్తూవచ్చింది

ఓరోజు రెపరెపలాడే సాయంత్రం వేళ చంద్రశేఖరం అదేపనిగా వచ్చి సరితాదేవికి తన ఆహ్వానాన్ని గుర్తు చేశాడు నేరుగా మేడమీద తన గది కొచ్చిన చంద్రశేఖరం ధైర్యానికి బొమ్మే అయింది సరితాదేవి కాసేపటికి తెప్పరిల్లుకొని –

"క్రింద కెళ్దాం పదండి !" అంది

ఇద్దరూ క్రింద హాల్లో కొచ్చి చెరో కుర్చీలో కూర్చున్నారు.

"మీ అక్కయ్య మిమ్మల్ని చూసేందు కొస్తుందని పిల్లల్తో చెప్పాను ప్రతి రోజూ ఆశగా మీ కోసం ఎదురు చూస్తున్నారు వాళ్ళతోపాటు నేనూ నిరీక్షణలోనే యీ పది రోజులూ గడిపానంటే నమ్మండి !" గలగలా నవ్వి సరితాదేవి వేపు ఆదోరకంగా చూసి అన్నాడు

చంద్రశేఖరం చూపులకు తట్టుకోలేక సరితాదేవి కళ్లు నెమ్మదిగా క్రిందకు వాల్చింది.

"మీ రింతగా నిరాశ పరుస్తా రని అనుకోలేదు"

"రోజూ రావాలనే అనుకుంటున్నాను '' టేబిలుమీ దున్న ఫ్లవర్‌వాజులోని పూలు సవరిస్తూ అంది

"రాలేకపోతున్నారా ? అవున్లెండి ! దిక్కులేని వాళ్ళమీద మీకు కనికర మెలా కలుగుతుంది ?" నిష్ఠురంగా అన్నాడు

"అవేం మాటలు ! అబ్బే ! అలాంటి భావాలు నాకు లేవంటే మీరు నమ్మండి ! రాకూడ దని అసలు లేనేలేదు" కళ్ళెత్తి చంద్రశేఖరం ముఖంలోకి చూస్తూ అంది.

"రాకూడ దని కాకుంటే, మరెందుకు రాలేదో చెప్పండి ?'' ఆమె కళ్ళల్లోకి గ్రుచ్చి గ్రుచ్చి చూస్తూ అన్నాడు

"వస్తాను కాస్త ఆలస్యమైన మాట మటుకు నిజమే దానికి క్షమించండి !'' అంది చూపులు ప్రక్కకు త్రిప్పుతూ

"అయితే రేపొస్తారా ?"

"రేపా ?"

"ఏం ?"

"ఏం లెదు" అస్పష్టంగా అంది



ఇంటియజమాని - ''ఓరి నువ్వా !? మనం 56 లో ఆ బేంకుని ఊడ్చి పెట్టాక మళ్ళీ కలవలేదుకదా ? ఇప్పు డేం చేస్తున్నావ్ ?''

---

"మీ రొక్కరూ రావటం యిష్టం లేకపోతే శైలజగార్ని కూడా తీసుకరండి !''

ఆమాటతో సరితాదేవి అభిమానం ఒక్కసారిగా బుస్సు మని పొంగింది ఓరకంట చంద్రశేఖరాన్ని చూసింది. పరిహాసం చేస్తున్నట్లుగా నవ్వుతున్నాయి అతని కళ్ళు. చివాల్న తల మరోవైపుకు త్రిప్పుకుంది.

"ఏ వంటారు ?"

"వస్తాను"

"రేపే ?"

"రేపే !"

"శైలజగారినిగూడా తీసుకరండి '"

"ఆవిడ కిలాంటి విషయాల్లో అంత ఆసక్తి లేదు" కఠినంగా అంది

"ఎలాగో మీరు రావడం ప్రధానం పిల్లల్తో యీ విషయం చెప్పనా ?"

"ఊ......"

టేబిలుమీదున్న యాష్ట్రే వైపు చూస్తూ కూర్చున్నాడు

సరితాదేవి కిటికీలోనుండి తోటలోకి చూస్తూ కూర్చుంది.

"ఓ విషయం ?"

"ఏవిటి ?" తల త్రిప్పి చూసింది.

"ఏ వనుకోరు గదా ?"

"అనుకొనే దేముంది ?"

"ఎవరో అన్నారు లెండి · నిజ మెంతో తెలుసుకుందా మని ?"

"అడగండి !" నవ్వి అంది

"మరేం లేదు...నేను నమ్మలే దనుకోండి మీరు విడాకు లివ్వబోతున్నా రటగా?"

సరితాదేవి ముఖం పాలిపోయింది

చంద్రశేఖరం తల త్రిప్పి, కనుకొనకుల్లో నుండి ఓరగా చూసాడు

అతి ప్రయత్నంమీద తన హృదయంలోని భావాలను అణచుకొని "ఎవరు చెప్పారు ?" అంది అతి ప్రశాంతంగా, నిశ్చలంగా

"ఎవరైందీ సరిగ్గా గుర్తులే దనుకోండి . "

"మీరు నమ్మా రన్నమాట ?" కళ్ళు దించి అంది లేకుంటే తన కళ్ళలోకి చూసి భావాల నెక్కడ చదవగలడో అని సరితాదేవి భయం

"నమ్మలేకనే మిమ్మ ల్నడిగాను...''

"అలాంటి అభిప్రాయం నాకు లేదు" నిశ్చల, గంభీర కంఠంతో అంది

"నేనూ అలాగే అనుకున్నాను .."

సరితాదేవికి బాగా కోప మొచ్చింది అలా అనుకున్నవాడు అడగడ మెందుకో ? అంత చాకచక్యంగా మాట్లాడ్డం తన కొక్కడికే చేతనవు ననుకున్నాడు గాబోలు ! అవతలి వాళ్ళు బాధపడ్తా రని కా స్తయినా ఆలోచించదేం ?

మరి కాసేపుండి వెళ్ళిపోయాడు చంద్రశేఖరం

సరితాదేవి ఆలోచనల్లో తేలిపోతూ అలాగే కూర్చుండిపోయింది

ఆ మర్నాడు ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు చాకలెట్లు, బిస్కట్ల పొట్లాలు తీసుకుని, తనే కారు నడుపుకుని అనాధాశ్రమంకు వెళ్ళింది సరితాదేవి. గేటు ముందు కారు ఆగీ ఆగక ముందే చంద్రశేఖరం కారు దగ్గర ప్రత్యక్ష మయ్యాడు సరితాదేవిని చిరునవ్వుతో పలకరించి, ఆమె చేతిలో ఉన్న చాక్లెట్, బిస్కట్ల పొట్లాలు తీసుకుని ముందు నడిచాడు

"మీ అక్కయ్య వచ్చింది చూద్దురుగాని రండి !'' అంటూ దూరంగా ఆడు కుంటున్న పిల్లల్ని కేక వేసాడు

ఆ కేకతో పిల్లలంతా పరిగెత్తుకొచ్చి చంద్రశేఖరాన్నీ, సరితాదేవినీ చుట్టేసారు.

"అక్కయ్య మీ కేం తెచ్చిందో చెప్పుకోండి చూద్దాం ?" అన్నాడు

"చాక్లెట్లు!...బిస్కట్లు!" అన్నారు పిల్లలు ఉత్సాహంగా.

"సరిగ్గా ఊహించారు చూడండి! మా పిల్లలు అసాధ్యులు సుమండీ!"

సరితాదేవి చిరునవ్వు నవ్వింది.

చంద్రశేఖరం పొట్లాలు విప్పి బిస్కట్లూ, చాక్లెట్లూ అందరికీ పంచాడు.

"అక్కయ్య మీకు చాక్లెట్లు తెచ్చిందిగా? మీరు పాటలుపాడి అక్కయ్యకు వినిపించొద్దూ?" అన్నాడు.

పిల్లలందుకు సంతోషంగా సమ్మతించారు. కొంతమంది పాటలు పాడారు. మరి కొందరు నాట్యం చేసారు. చివరన అందరూ కలిసి జాతీయగీతం పాడారు.

"ఇక వెళ్ళి ఆడుకోండి" అన్నాడు చంద్రశేఖరం.

ఉత్సాహానికీ, సంతోషానికీ ప్రతిరూపమైపోయిన ఆ అనాధలను చూస్తూ కొన్ని క్షణాలపాటు తన్ను తాను మరచిపోయింది సరితాదేవి.

వారి దీన స్థితిని తలచుకోగానే హృదయం అవ్యక్తమైన బాధతో మెలికలు తిరిగింది. కళ్ళు చెమ్మగిల్లాయి.

'తన జీవితం వీళ్ళకు అంకితం చేస్తే?' ఒక అస్పష్టమైన భావన, మనసులో అలా తళుక్కుమని మాయమైపోయింది.

"ఆశ్రమం చూద్దురుగాని రండి!"

తన ఊహల నుండి తేరుకుని చంద్రశేఖరం వెంట నడిచింది.

గదులు చిన్నవయినా పరిశుభ్రంగా ఉన్నాయి. లోపల వంటగదిలో ఒక ముసలామె వంట చేస్తోంది.

"ఈ రోజు కూర లేమిటి?"

"బీరకాయ కూర, రసం" అందామె సరితాదేవి వేపు పరీక్షగా చూస్తూ.

తర్వాత వెనక వరండాలోనుండి పెరటివేపు నడిచారు.

పెరడు చాలా విశాలంగా ఉండి, రకరకాల కూరగాయల పాదులతో నిండి ఉంది.

"ఈ తోటలో కూరగాయలే మాకు సరిపోతాయి. ఇకపోతే బియ్యం – సంవత్సరానికి ఇన్నని వడ్లే యిస్తారు. డబ్బు కొంత చందా రూపములో వస్తుంది. ప్రభుత్వ సహాయమూ ఉందనుకోండి. మీరూ మా ఆశ్రమ చందాదారుల్లో ఒకరు కావాలని నా ఆశ" సరితాదేవి ముఖంలోకి చూస్తూ అన్నాడు.

"తప్పకుండా"

"కృతజ్ఞుణ్ణి!"

"మొత్తం ఎంతమంది పిల్లలున్నారు?"

"నూటయాభై మంది''

"నాలు గడుగులు వేసామంటే మామిడితోపు వస్తుంది. పదండి మా మామిడి తోట చూద్దురుగాని" ముందు నడుస్తూ అన్నాడు.

సరితాదేవి రెండు క్షణాలపాటు అలాగే నిల్చుండిపోయింది.

చంద్రశేఖరం వెనక్కు తిరిగిచూసి —

"అలసిపోయా రేమో ? వెనక్కు తిరిగి పోదామా ?''అన్నాడు ఆమె కళ్ళల్లోకి గ్రుచ్చిగ్రుచ్చి చూస్తూ.

"ఇంతలో ఏం అలసట ? పదండి, తోట చూద్దాం"అంది చంద్రశేఖరం కళ్ళల్లోకి చూస్తూ.

హృదయంలోని భావాలను చదివేందుకు ప్రయత్నిస్తూ ప్రశాంతంగా వున్న ఆమె హృదయసరోవరం, అనుమాన తరంగాలతో సంచలనమై పోయింది. వెనక్కు తిరిగి వెళ్ళను అభిమానం అడ్డుపడింది. రెండు నిముషాల్లో మామిడితోట చేరు కున్నారు.

"మామిడితోట ఎప్పుడైనా చూసారా ?" అన్నాడు వెనక్కుతిరిగి సరితాదేవి ముఖంలోకి చూస్తూ.

అదేం ప్రశ్న అన్నట్లుగా నవ్వింది సరితాదేవి.

"ప్రతి సంవత్సరం యీ తోటమీద మాకు రెండు మూడు వేలు లాభ మొస్తుంది. యీసారి అంత మంచి కాపులేదు"

"అవును"

"అదో ! దూరంగా కనిపిస్తుందే ఆ చిన్న మొక్క—అది మల్‌గూబా. మొన్ననే తెప్పించి నాటాము"

"ఈ తోటా చౌదరిగారిదేనా ?"


''అవును. అయితే ఆశ్రమాని కిచ్చేసారు. మామిడి కాయలంటే మీ కిష్టమేనా ?"

"ఎందుకులేదు ?" నవ్వుతూ అంది.

"పచ్చి అంటుమామిడికాయలు బాగుంటాయి. అందులో పిందెలు మరీనూ ! అంటుమామిడితోటకు మన తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగ్గ స్థానమే లభించింది" సరితాదేవి కళ్ళల్లోకి చూసి, ఫకాల్మున నవ్వి అన్నాడు.

సరితాదేవి గుండెలు గుభిల్లు మన్నాయి.

ఆ నవ్వు మామూలుగా లేదు. ఆలోచనలు శరవేగంతో సాగిపోయాయి.



"ఇంతకీ వాళ్ళు ఒకళ్ళ నొకళ్ళు ఏమని తిట్టుకున్నారు ?''
''నాకు సరిగ్గా జ్ఞాపకం లేదండి, కానీ, ఒక్కొక్కడు అవతలవాడు ఏమిటో అది తిట్టేవాడండి."

---

కల్మషమైన అతని హృదయం ఆ నవ్వులో ప్రతిఫలించడం లేదా ? త్వరగా వెళ్ళిపోవడం మంచిదేమో ? అయినా నవ్వు నాధారంగా చేసుకుని ఒక మనిషి స్వభావా న్నెలా నిర్ణయించడం ? కొంద రలాగే నవ్వుతారు. కలెక్టరుగారు అలాగే నవ్వేవారు. తను ముందు శంకించింది. కానీ అతని నిష్కల్మషమైన హృదయం, స్వచ్ఛమైన స్నేహశీలతా తన అభిప్రాయాలను పూర్తిగా మార్చేసాయి. మనిషి తత్త్వాన్ని గ్రహించడం సులభమైన పనేమీ కాదు. కానీ అంతమాత్రంచేత చంద్రశేఖరాన్ని శంకించడం న్యాయంకాదేమో ?

"ఇవి తీసుకోండి !"

సరితాదేవి చెయ్యి చాపింది ఆలోచనల నుండి తేరుకుని. మామిడి ముక్కలు ఆమె చేతిలో పోసాడు. చేతి రుమాలు క్రింద పరిచి మామిడి ముక్కలు దానిమీద పోసింది.

''కాసేపు కూర్చుని వెళ్దామా ?" అన్నాడు.

పశ్చిమకాంత సౌందర్యాన్ని తిలకిస్తున్న సరితాదేవి సరే నంది.

ఇద్దరూ మామిడిచెట్టుక్రింద కూర్చున్నారు. అంతర్జాతీయ రాజకీయాల దగ్గర్నుండి, అనాధాశ్రమ ఉద్ధరణవరకూ మాట్లాడారు. తోటనంతా చీకటి చుట్టుముట్టింది. గూళ్ళ కెళ్తున్న పక్షుల కలకలారావాలు వినిపిస్తున్నాయి.

రుమాల్లో పోసిన మామిడి ముక్కలు అయిపోయాయి.

సరితాదేవి రిస్టువాచీ చూసింది. ఆరూముప్పావు కావొస్తుంది.

"ఇక వెళ్దాం" లేస్తూ అంది.

చంద్రశేఖరం లేచి నిల్చున్నాడు.

"చాలా శ్రమ యిచ్చాను" దారితీస్తూ అన్నాడు.

"ఇందులో శ్రమే ముంది? నవ్వి అంది.

సరితాదేవి నడుస్తూనే ఉంది. ఒకటి, రెండు, మూడు. నాలుగు, ఐదు నిముషాలు ఒకదానమ్మట మరొకటి నిశ్శబ్దంగా వెళ్ళిపోయాయి.

సరితాదేవి హృదయం ఆశ్చర్యపోయింది.

ఏదో అడగబోయేసరికి చంద్రశేఖరం వెనక్కు తిరిగి – "దారి తప్పాం" అన్నాడు.

సరితాదేని చిత్తరువే అయింది.

మెదడులో వేయి అనుమానాల కాలసర్పాలు బుస్సుమని లేచాయి. తన ఊహా గానమే నిజమవుతుందా? లేకుంటే చంద్రశేఖరం దారి తప్పడమేంటి? తను ఆలోచిస్తూ నడుస్తుందేగాని, ఏ దారిన వెళ్తున్నా మన్న విషయం గమనించనేలేదు.

"అగ్గిపెట్టె లేదా?'' కంఠంలో ఎలాంటి మార్పూ కనిపించనీకుండా అంది.

"లేదు."

"మీరు దారి తప్పడమేంటి?" కాస్త కోపంగానే ప్రశ్నించింది.

"పరధ్యానంలో నడిచాను."

"సరైన దారి చూసి నడవండి!" ఆజ్ఞాపించినట్లే అంది.

చంద్రశేఖరం ఒక్కమాటా మాట్లాడ్లేదు. ఒక్కఅడుగు ముందుకు వెయ్యామాలేదు. ఒక్క క్షణం మౌనంగా గడిచిపోయింది.

"మాట్లాడరేం?"

"సరితా! ఇంకా ఈ నాటక మెందుకు? మన మనసుల్లో ఏముందో మనిద్దరికీ తెలుసు!" కంపిస్తున్న గొంతుతో అన్నాడు.

సరితాదేవి హృదయం భగ్గున మండింది. చెంప కొకటి యిద్దామా అని మానుకుంది.

"మీరు పొరపడ్డారు చంద్రశేఖరంగారూ!" వ్యంగ్యంగా, హేళనగా అంది.

"లేదు. నీ మనసులో ఏముందో నాకు బాగా తెలుసు! ఇంకా దాపరిక మెందుకు?" సరితాదేవి చేతిని తన చేతిలోకి తీసుకుని అన్నాడు.

"బ్రూట్! వొదులు!" చంద్రశేఖరం చేతిని బలంగా విసిరికొట్టూ అంది.

"సరితా !"

చంద్రశేఖరం విడుస్తున్న భారమైన ఉచ్ఛ్వాస నిశ్వాసాలలోని వేడిగాలులు సరిత చెంపల్ని కాలుస్తున్నాయి అతను ఆమెకు దగ్గరగా మరీ దగ్గరగా జరిగాడు. వొణుకుతున్న అతని చేతులు ఆమెను చుట్టేందుకు ప్రయత్నించాయి.

"మిస్టర్ చంద్రశేఖరం !" ఆడపులి గర్జించినట్లే అయింది.

"ఏం ? ఆ బట్టతల కలెక్టరుపాటి నేను చెయ్యనా ?" క్రూరంగా, హేళనగా అన్నాడు.

"చేస్తావో, చెయ్యవో నిర్ణయించుకోవలసినదాన్ని నేను ! అనవసర ప్రసంగం చేయకు. జాగ్రత్త !" కోపంతో ఊగినట్లే అయింది.




అంత చీకటిలోనూ కోపానలాన్ని క్రక్కుతున్న ఆమె కనుదోయిని చంద్రశేఖరం గుర్తించాడు. అయినా ఆవరించిన మైకపు తెరలు కొంచమైనా సడలలేదు.

కోపోద్రేకంవల్ల ఒకరూ, కామోద్రేకంవల్ల మరొకరూ భారంగా, వేగంగా ఊపిరి తీసుకుంటున్నారు.

"దబాయిస్తే సరిపోతుందా? సోషల్ వర్కంటూ మీలాంటి సొసైటీ లేడీస్ చేసే సేవ ఏమిటో నాకు బాగా తెలుసు!'' ఆమెను బలంగా తన వైపుకు లాక్కుంటూ అన్నాడు.

సరితాదేవి కాళికాదేవే అయింది.

చంద్రశేఖరం చెంప 'ఛెళ్' మంది.

"రాస్కెల్! నీకింత ధైర్యమా? నేనెవరో కాస్త గుర్తుంచుకో! ఇంకా అధికప్రసంగం చేసావో కాలికింద నల్లిలా నలిపివేయగలను!" కోపంతో వొణికి పోతూ అంది.

'నేనెవరో గుర్తుంచుకో' అన్నమాట చంద్రశేఖరంమీద బాగానే పనిచేసింది.

వేడెక్కి పొగలు క్రక్కుతున్న శరీరం, క్షణంలో చప్పగా చల్లబడిపోయింది. కళ్ళకు క్రమ్మిన మైకం తొలగి పరిస్థితేమిటో అర్థమైంది. రమణమూర్తి తలుచుకుంటే ఈ ఊరినుండేకాదు, యీ లోకంనుండే తన్ను శాశ్వతంగా సాగనంపగలడు. అంత శక్తి, సామర్థ్యమూ అతని కున్నాయి. సరితాదేవి విషయంలో తను పొరపాటే పడ్డాడు. బ్రతికుంటే యిలాంటి సరిత లెందరైనా దొరుకుతారు.

సరితాదేవి వెళ్ళేందుకు వెనక్కి తిరిగింది.

"అలా వెళ్ళకండి!" హీన స్వరంతో అన్నాడు. సరితాదేవి ఆగింది.

"ఇటురండి" అన్నాడు వేరే దారితీస్తూ.

"ఎలా నమ్మడం?" చీకటిని చీల్చుకుని చంద్రశేఖరం కళ్ళల్లోకి చూస్తూ అంది.

చంద్రశేఖరం అగ్గిపెట్టె తీసి వెలిగించి దారి చూపాడు.

ఆ వెలుగులో చంద్రశేఖరం ముఖాన్ని పరీక్షగా చూసింది. ఆమె ముఖంలోకి చూడలేక తలదించుకున్నాడు.

"నన్ను నమ్మితేనే రండి!" అన్నాడు అస్పష్టంగా అడుగు తీసి ముందుకేస్తూ.

సరితాదేవి ఓ క్షణం ఆలోచించి అతనిని అనుసరించింది. మూడు నిముషాల్లో గేటు దగ్గర కొచ్చారు.

సరితాదేవి కారు స్టార్టు చేసింది.

"క్షమించండి! పొరపాటు జరిగింది" గొణిగాడు.

సరితాదేవి విసురుగా తల తిప్పుకుంది.

కారు వేగంగా పరుగు తీసింది.

అవమానం తాలూకు అగ్నిజ్వాలలు సరితాదేవి హృదయాన్ని కాల్చివేస్తున్నాయి.

బరువుగా అడుగులేస్తూ మేడమీద తన గదికి వెళ్ళి పడకమీద వాలిపోయింది.

ఆ క్షణంలో జీవితం మీద విరక్తి కలిగింది.

ఆలోచనలు గజిబిజిగా ఉన్నాయి

అవ్యక్తమూ, అర్థరహితమూ అయిన ఆవేదనతో హృదయం అలమటించి పోతూనే ఉంది

తన నెందుకు లోకం ఇలా శంకిస్తుంది? ఏం తప్పుచేసిందని? పుట్టింటికి రావడమే తప్పా? ఆ మాత్రం చేత భర్త నొదిలినట్టు లెక్కా? విడాకులు తీసుకో బోతున్నట్టు అర్థమా? ఏమిటీ మనుషులు?

ఏకారణం వల్లనో భర్తనొదిలి వస్తే శీలవతి కాదని భావమా? చంద్రశేఖరంకు ఎంత చులకనై పోయింది తను?

భగవాన్! స్త్రీ జీవితాన్ని ఎంత చిత్రంగా సృష్టించావు! సర్వకాల సర్వావస్థల యందు పురుషుని బలంమీద, దయమీద ఆధార పడేటట్లు చేసావు! ఏ మాత్రం స్వతంత్రించినా, ఆమెకు మానసిక క్షోభ తప్పదు.

ఇలా రావడంలో తాను పొరపాటే చేసిందేమో? లలిత ఎవరు? ఆమె మాటలకు తనెందు కంతగా రోషగించు కోవాలి?

చేతులారా తన సంసారాన్ని ఎందుకు భగ్నం చేసుకోవాలి? అన్నయ్య ఆప్యాయత కొద్దీ హంసతూలికా తల్పం మీదనుండి తనను దిగనివ్వకపోయినా, భర్తదగ్గర ఉన్నప్పుడు కలిగే సుఖమూ, సంతోషమూ ముఖ్యంగా ఆత్మశాంతి లభించవు

తన ప్రతి మాటకూ, కదలికకూ విపరీతార్థాలు కల్పిస్తున్న యీ లోకం ఎలాపోతే తన కెందుకు? ఆ లోకాన్ని ఏదో ఉద్ధరించాలన్న ఆరాటం తన కెందుకు? తన లాంటి విద్యావతి, సంస్కారవతి ముందుకొచ్చి సేవ చేసేపాటి అవకాశాలు ఇంకా యీ సంఘంలో లేవు. ఈ సంఘ మింకా సంస్కరింపబడాలి. ఆ రోజే తనలాంటి వారు యీ సంఘంలో సేవచేస్తామంటూ ముందుకు రావాలి. అందుకనే నేమో దేశ సేవకే జీవితం అంకితం చేయాలనుకున్న మహిళలు గడపదాటి యివతల ప్రపంచంలో అడుగు పెట్టలేక పోతున్నారు చిన్ననాటినుండీ హృదయంలో అతి పదిలంగా దాచుకుని, ముద్దుగా, మురిపెంగా పెంచుకొంటున్న ఆశలకూ, ఆశయాలకూ, సేవాభిలాషకూ వాస్తవిక లోకం ఒక పెనుతుఫానే అవుతుంది ఆశలనూ, ఆశయాలనూ సమూలంగా, అతిక్రూరంగా పెకిలించి, వాస్తవికతను మరచి పోవద్దని కఠినాతి కఠినంగా శాసిస్తుంది యీ లోకం.

ఇక మిగిలి ఉన్న మార్గం ఒకటే. వారి దగ్గరకు వెళ్ళిపోవడం. ఒక్క ఉత్తర మన్నా వ్రాయకపోవడంలో అర్థం? ఎంతొకవేళ పొరపాటు తనదే అయినా... పోనీ తనే ఉత్తరం వ్రాస్తే?

పరిపరి విధాల ఆలోచనలు పోతున్నా, చంద్రశేఖరం అన్నమాటలు మటుకు చెవుల్లో రింగుమని మారు మ్రోగుతున్నాయి.

"సోషల్ వర్కంటూ మీలాంటి సొసైటీ లేడీస్ చేసే సేవేంటో నాకు బాగా తెలుసు!" అన్నమాటలు సునిశిత బాణాల్లా హృదయంలో గ్రుచ్చుకొని, హృదయాన్ని రక్తపు మడుగుగా చేసాయి.

కన్నీటిబొట్లు చెంపల మీదుగా జారి ప్రవహించాయి.

'రేపు తప్పక వెళ్ళిపోవాలి' అని హృదయం పదే పదే చెప్తుండగా, బరువుగా, బాధగా కళ్ళు మూసుకుంది సరితాదేవి

* * *

ఉదయం ఏడు గంట లయింది. బాల భానుని బంగారు కిరణాలు కిటికీలోనుండి మెల్లగా ప్రాకివచ్చి అతిమృదువుగా, వెచ్చగా తాకుతున్నాయి. కిటికీలో అమర్చిన తొట్లలోని గులాబి చెట్లు నిద్ర బద్ధకాన్ని పోగొట్టుకుంటున్నట్లు ఆణిముత్యాల్లాంటి తుషార బిందువులను జల్లుమని రాల్చాయి ప్రఫుల్లమూ, సౌరభ భరితమూ అయిన గులాబి కన్నెలు ప్రేమతో ఉదయ భానుడిచ్చిన వెచ్చని తియ్యని, ముద్దుకు పరవశం చెంది, అర్థనిమీలిత నేత్రాల్లోనుండి సుతారంగా, మధురంగా చూస్తున్నాయి

'ఇందుకే గాబోలు గులాబీ లంటే వారికంత యిష్టం' పుష్ప సౌందర్యాన్ని వీక్షిస్తున్న సరితాదేవి హృదయాంతరంలో ఒక మధురోహ అల్లనల్లన కదిలింది. ఏం చేస్తున్నారో?

మధురమూ, బాధాకరమూ అయిన చిరునవ్వొకటి సన్నని, ఎఱ్ఱని పెదవుల మీద ఒక్క క్షణం కదిలాడింది.

"వలపు తలపుల పరవశత్వమా?" ఫక్కున నవ్వి పరిహాసమాడింది శైలజ.

సరితాదేవి చిన్నగా నవ్వింది జవాబుగా.

"కాఫీ చల్లగా ఐ పోతూంది. మీ అన్నయ్య యింకా రాలేదు పోనీ నువ్వు తీసుకో సరితా!" కాఫీ కప్పు సరితాదేవి ముందుకు నెట్టూ అంది శైలజ.

ఇంతలో రమణమూర్తి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"జయప్రదరావు ఉత్తరం వ్రాసాడు" కాఫీకప్పు తీసుకుంటూ అన్నాడు రమణమూర్తి.

సరితాదేవి ముఖం ప్రఫుల్ల పంకజమే అయింది

"ఎప్పుడు ?" సంతోషాన్ని అతి ప్రయత్నంమీద దాచి ప్రశ్నించింది

"నిన్న సాయంత్రం వచ్చింది చెప్పాలని నీ గదికే వచ్చాను నువ్వు లేవు తర్వాత శైలజ చెప్పింది అనాథాశ్రమంకు వెళ్లావని "

ఔనన్నట్లు తలూపింది సరితాదేవి

"నేను ఉత్తరం వ్రాస్తే జవాబు వ్రాసాడు"

"ఏమని ?" కాఫీ కప్పు చేతిలోకి తీసుకుని అంది

"విడాకులు తీసుకోను తన కెలాంటి అభ్యంతరమూ లేదట" చెల్లెలు ముఖంలోకి చూస్తూ అన్నాడు

సరితాదేవి ఓ క్షణంపాటు శిలాప్రతిమే అయింది

మరుక్షణం లతలా కంపించింది మనిషితోపాటు చేతిలోఉన్న కాఫీ కప్పు మెల్లగా కంపించింది ముఖం తెల్లపడింది పెదిమలు వొణికాయి బాష్పతప్తమైన కన్నులు భయాన్ని, ఆందోళనను కుమ్మరిస్తున్నాయి.

ఆడబిడ్డను పరికించి చూచిన శైలజ భర్తవేపు తిరిగి – "ఏవిటిది ?" అంది ఆందోళనగా

"ఏవిటన్నయ్యా ? నాకేం అర్థం కావడంలేదు" విచలిత కంఠంతో అంది సరితాదేవి

"నేను వ్రాసిన దానికే అతను జవాబు వ్రాసాడు" కాఫీ చప్పరిస్తూ అన్నాడు

"ఏం వ్రాసా రేంటి ?" కాస్త కోపంగానే ప్రశ్నించింది శైలజ

"ఏం వ్రాస్తాను ? సరిత వచ్చి మూణ్ణెల్లకు పైగా అయిందా ? ఒక్క ఉత్తరం ముక్కైనా వ్రాయకుండా అలా మౌనంగా ఉండిపోతే ఏవి టర్థం ? విడాకు లేమన్నా తీసుకోవా లనుకుంటున్నావా, అని వ్రాసాను ఏం ? తప్పా ?"

"తప్పా ! మీరు చేసిన పని తప్పెలా అవుతుంది ! ఇంత పేరున్న వకీలుగారు !"

రమణమూర్తికి భార్య మాటల్లోని వ్యంగ్యం అర్థం కాకపోలేదు

"ఏవిటి శైలజా ? నువ్వనడం ?" కాస్త చిరాగ్గానే అన్నాడు

"ఏ వంటున్నాను ! ఏ వనలేదు మహాప్రభూ ! ఇక మీ యిష్టం, ఏవన్నా చేసు కోండి !" అంటూ కుర్చీలోనుండి లేవబోయింది

"కూర్చో కూర్చో ఇంతకూ మనసులో మా టేమిటో చెప్పరాదూ ?"

"మనస్పర్ధలు రాకపోవు పొరపా టెవరిదో తెలీదు సరిత అలిగి పుట్టింటి కొచ్చిన విషయం నిజమే ఉత్తరం రాలేదన్న మాట వాస్తమే అయినా వాళ్ళ

మనస్పర్థకు కారణ మేమిటో, వాళ్ళ హృదయాల్లోని భావా లేమిటో మనకు తెలీదు. నచ్చచెప్పి భర్త దగ్గరకు పంపవలసిన మీరు విడాకు లిప్పించను సిద్ధపడడం గొప్ప తన మౌతుందా ?'' తిరిగి కుర్చీలో కూర్చుని అంది

"మూర్ఖుడూ, బుద్ధిహీనుడూ అయిన భర్తతో జీవితాంతం కాపురం చెయ్యవలసిన దుర్గతి నా చెల్లెలుకు లేదు పొత్తు కుదర నప్పుడు విడిపోవడమే మంచిది పతియే ప్రత్యక్ష దైవమని గుడ్డిగా పూజించే అనాగరక వనిత కాదు సరిత నీ భావాలూ, ఆలోచనలూ ఎప్పుడూ సంకుచితమే" కాఫీ కప్పు టేబిలుమీద పెట్టి, శైలజ ముఖంలోకి చూస్తూ అన్నాడు

"అయితే సరితకూ్కడా యీ ఉద్దేశ ముందన్న మాట ! పొరబడ్డాను" సరితా దేవి ముఖంలోకి ఓరగా చూస్తూ అంది

అంతవరకూ సరితాదేవి కేవలం ప్రేక్షకురాలే అయింది

''సరిత బి సి కాలం స్త్రీ కాదు ఆధునిక యువతి'' చెల్లెలి ముఖంలోకి గర్వంగా చూస్తూ అన్నాడు

"ప్రాచీన, ఆధు క యువతులు ఎన్ని విషయాల్లో భేదించినా, ఒకే అంతరంగం కలవారు'' ఆవేశంగానే అంది శైలజ

"ఆ విషయం మరచిపోవడం అనర్థాలకు దారితీయడమే అవుతుంది" ఏం మాట్లాడక మౌనంగావున్న భర్త ముఖంలోకి చూస్తూ తిరిగి అంది

"నాకీ అభిప్రాయమున్నట్లు ఏరోజూ చెప్పలేదన్నయ్యా ?" ఎంత అన్నయ్యవైనా, లాయరువైనా యింత చనువు తగదన్నట్లు అర్థవంతంగా అంది సరితాదేవి

"నువ్వు చెప్పలేదు చంద్రశేఖరం అన్నాడు"

"చంద్రశేఖరం !'' ఆశ్చర్యానికి ప్రతిరూపే అయింది

"అవును మాటల సందర్భంలో చంద్రశేఖరం అన్నాడు"

సరితాదేవిలో కోపం ఉప్పెనలా పొంగింది చంద్రశేఖరం అసభ్యకరమైన ప్రవర్తన రమణమూర్తి ముందు పెట్టాలని, మానుకుంది

చంద్రశేఖరం తప్పే చేసినా, సరితాదేవి క్షమించి వొదిలేసింది

"చంద్రశేఖరం అభిప్రాయం నా అభిప్రాయమెలా అవుతుం దన్నయ్యా ?'' లేని నవ్వును ముఖంమీదకు తెచ్చుకుని అంది

''అయితే నీకీ అభిప్రాయం లేదా ?''

"లేదు''

ఆశ్చర్యపోవడం రమణమూర్తి వంతయింది



"పిప్పిపన్ను తీసివేయడానికి ఎంత పుచ్చుకుంటారు డాక్టరు గారూ !"

''5 రూపాయలు! "

"ఒక్క నిమిషం పనికి 5 రూపాయలా ?"

''పోనీ, ఒక గంట సేపు తీస్తానమ్మా నీ పిప్పిపన్ను"

---

"పరువు ప్రతిష్ఠలకోసం, ఆత్మగౌరవాన్నీ, ఆత్మాభిమానాన్నీ చంపుకోకు సరితా ! నువ్వు నాకు బరువుకావు బాగా ఆలోచించుకో'' అంటూ అక్కణ్ణుంచి లేచి వెళ్ళాడు

సరితాదేవి అర్థవంతంగా శైలజ ముఖంలోకి చూసింది

"స్త్రీ హృదయం మీ అన్నయ్య కేం తెలుసు ? త్వరగా వెళ్ళడమే మంచిది సరితా !" అంది మెల్లగా నవ్వి

"ఉదయం వరకూ యీ భావనతోనే ఉన్నాను కానీ...యింకెలా పోనొదినా ?" ముఖం మరోవైపుకు తిప్పుకుని అంది

"అదేం ?" ఆశ్చర్యపోయింది

''ఈ అభిప్రాయాం నాదేనని వారు తప్పక అనుకుంటారు ఎంతగా నన్ను ప్రేమించినా యీ రోజు బలవంతంగా నైనా సరే హృదయ ద్వారాలను మూసి వేసే ఉంటారు" గద్గద కరంతో అని దోసిట్లో ముఖం దాచుకుంది

"అలా అనుకోకు సరితా! జయప్రదరావు అంతటి అజ్ఞాని, అవివేకీ కాడు విషయంచెప్తే అర్థం చేసుకోగల సహృదయుడు" సరితాదేవి భుజంమీదచెయ్యివేసి, ఆప్యాయంగా అంది

"వొదినా!" రెండుచేతుల్తో శైలజమెడనుచుట్టి, భుజంమీద వాలిపోయింది

"నా మాటవిను, చేతులు కాలాక ఆకులుపట్టుకుని ప్రయోజనం లేదు" బుజ్జగించింది

"నావల్ల కాదు వెళ్ళలేను" అస్పష్టంగా గొణిగింది.

"వొద్దు సరితా! చేజేతులా వినాశం కొని తెచ్చుకోకు" సరిత తలనెత్తి చెక్కిళ్ళ మీద జారిన కన్నీటిని తుడుస్తూ అంది

"ఈ రోజు వెళ్తే ..ఒక భిక్షుకిలా వెళ్ళి వారిముందు నిల్చోవలసిందే" గద్గద కంఠంతో అంది.

"పోనీ నే నొస్తాను, జరిగిన పొరపాటేమిటో, ఎవరిదో చెప్తాను"

"అదేమవుతుంది వొదినా! నా పక్షంగా నువ్వు భిక్షకోరడమే అవుతుందిగా?"

"సరితా! ఆత్మాభిమానం ఉండవలసిందే కానీ అది నీ సర్వనాశనాన్ని కొని తెచ్చేదయితే వొదులుకోవడమే మంచిది నా మాట విను భార్యాభర్తల మధ్య అభిమాన మేమిటి?"

"ఏ ముఖం పెట్టుకుని పో నొదినా? ఒక వేళ వెళ్ళినా ఎంత చులకనై పోతాను? విడాకులే కోరానంటే వారికి నా మీద ఎలాంటిభావం ఏర్పడి ఉంటుంది? ఇక నా కక్కడ స్థానంలేదు" అంటూ తన గదివేపు నడిచింది

శైలజ బరువుగా నిశ్వశించి వంటగదివేపు దారి తీసింది

సరితాదేవి హృదయం బరువుగా — భారంగా ఉంది గదికెళ్ళి కుర్చీలో కూల బడింది టేబిలుమీద చేతులుపెట్టి, దోసిట్లో ముఖం దాచుకుంది

కలలోగూడా ఊహించని విషయం వాస్తవంగా జరిగితే ఒక వ్యక్తి పరిస్థితి ఎలా ఉంటుందో సరిగ్గా అలాగే ఉంది సరితాదేవి పరిస్థితి

తను విడాకులు కోరడమా? ఏరోజయినా అలాంటి విషయాన్ని గురించి ఆలోచించిందా? మంచితనానికి మారుపేరయిన వారినుండే విడాకులు కోరితే యిక త నెవరితో సుఖంగా జీవించగలదు? ఆవేశంతో తను ష్టట్టింటికి రావడం పొరపాటే అయినా అంతచిన్న పొరపాటు యింత ఉపద్రవానికి దారి తీస్తుందని ఏరోజన్నా అనుకొనుంటే...

ఎంత నవనాగరీకంగా తను పెరిగినా, ఎంత అధునాతనంగా, విశాలంగా అన్నయ్య ఆలోచించినా, కనీసం తన అభిప్రాయమన్నా తీసుకోందే అన్నయ్య ఆలా వ్రాయడం సముచితంగా లేదు అన్నయ్య పొరపాటే చేశాడు పోనీ తను వెళ్ళి ఉహు ఎలా వెళ్ళగలదు ? ఏం చేసేందుకూ తోచలేదు సరితా దేవికి

నిరంతర మానసిక సంఘర్షణకు నిలయమై పోయింది ఆమె హృదయం

చివరకు మద్రాసులో ఉన్న వందన వద్దకు ప్రయాణమై పోయింది – ఆత్మ శాంతికోసం

*　　*　　*

"సరితాదేవిగారా ? రండి ! రండి !" సాదరంగా ఆహ్వానించాడు డాక్టరుచలపతి

"మీ రిక్కడున్నారా డాక్టర్ ? మిమ్మల్ని కలుసుకుంటానని అసలు అనుకోలేదు"

"కాస్త పనుండి మొన్ననే వచ్చాను"

"నాకూ మీ తమ్మునితో కాస్త పనుండి వచ్చాను నా స్నేహితురాలి అడ్రసు కనుక్కో గలరేమోనని " కుర్చీలో కూర్చుని నవ్వి అంది

"ప్రస్తుతం యింట్లో లేడు ఆ పనేదో నాకే పురమాయించండి !" నిండుగా నవ్వుతూ అన్నాడు

"ఆమెపేరు వందన ఏదో అనాధాశ్రయంలో పనిచేస్తుందని విన్నాను అంత కన్నా ఎక్కువ వివరాలు తెలీవు"

"వందన తెలీకేం ? బాగా తెలుసు"

"నిజమా డాక్టర్ !" ప్రఫుల్ల వదనంతో అంది

"ఎమ్ ఎ పాసయ్యారు కాస్త పొడుగ్గా, సన్నగా, తెల్లగా ఉంటారు"

"అవును ఇప్పుడే వెళ్దామా డాక్టర్ !"

"ఇప్పుడు గంట ఎంతయిందో చూడండి సరితాదేవిగారూ ! అన్నంకూడా తిన కుండా వెళ్ళామంటే మా వాడు నా ప్రాణమే తీస్తాడు!"

"అన్నయ్య ఆత్మీయుల్లో సారధి ఒకడు నన్ను ఎంతగా ప్రేమిస్తాడో అంతగా గౌరవిస్తాడు ఇక్కడ కొస్తున్నానంటే అన్నయ్య మరో మాటనకుండా సాగ నంపాడు సారధిఅన్నయ్యకు కనుపించే మరీ వందన దగ్గర కెళ్తాను" నవ్వుతూ అంది,

"విజయ వంటింట్లో ఉన్నట్లుంది వొదిన దగ్గర అరమరిక లేమున్నాయి? స్నానం చేసేటట్లుంటే వెళ్ళండి విజయా ! " అంటూ కేక వేసాడు

"వొద్దు వొద్దు నేనే వెళ్తాను'' అంటూ లోపలి కెళ్ళింది

ఒంటి గంటకు సారథి వొచ్చాడు. కుశల ప్రశ్నలయ్యాక అంతా భోజనాలకు లేచారు.

సాయంత్రం నాలుగు గంటలకు డాక్టర్ చలపతీ, సరితాదేవీ ఆశ్రమముకు బయల్దేరారు.

"ఓ ! సరితా ! నువ్వేనా ! నేనింకెవర్నన్నా చూస్తున్నానా ?" ఆశ్చర్యం, ఆనందం మేళవించగా, సరిత భుజాలను ఊపేస్తూ అంది వందన — సరితాదేవిని చూడగానే.



"సరితనే చూస్తున్నావు ! నీ కోసం వెతుక్కుంటూ సరిత వొచ్చినప్పుడు సరితను కాక యింకెవర్ని చూస్తావు ?" నవ్వుతూ అంది.

"నా మీద సరితకు అంతదయ కలిగిందన్నమాట ! పోన్లే ! మళ్ళీ ఎన్నాళ్ళకు కలుసుకున్నాం సరితా! అంతా క్షేమమేనా? శ్రీవారు కుశలమా ? పిల్లలెందరు ?" ఆప్యాయతనంతా కుమ్మరించింది వందన.

"పిల్లలా ! పది మంది !" ఫక్కున నవ్వి అంది.

"నిజం !" తనూ నవ్వును జోడించి ప్రశ్నించింది.

"నిజమే ! నా మాట అబద్ధమైతే డాక్టరుగారి నడుగు" వచ్చేనవ్వు నాపుకుంటూ అంది.

"ఓ ! ప్లీజ్ ఎక్స్క్యూజ్‌మి డాక్టర్ ! సరితను కలుసుకున్న సంతోషంతో మీ ఉనికినే మరచిపోయాను ! దయచేసి కూర్చోండి ! సరితాదేవిగారూ ! తమరూ ఆసనం అలంకరించండి !"

ముగ్గురూ కూర్చున్నారు.

"ఇంతకూ మా సరితకు పిల్లలెందరండీ ?" డాక్టరు ముఖంలోకి చూసి ప్రశ్నించింది వందన.

"లేరు''

"పెళ్ళి చేసుకోలేదేం ?'' వందన ముఖంలోకి పరీక్షగా చూస్తూ ప్రశ్నించింది సరితాదేవి

"చేసుకోలేదు"

"అదే ! ఎందుకని ?"

"ప్రత్యేకమైన కారణాలంటూ ఏమీ లేవు"

"ఇక చేసుకో పేమిటి ?"

"బాగు ది ! అలాగని ఎలా చెప్పడం ?''

"నాకు చూస్తే ఇదేదో . '' ఆగింది

ఆ సంభాషణ వింటున్న చలపతికి నవ్వొచ్చింది టేబిలుమీదున్న పేపరుతీసి ముఖం దాచుకున్నాడు

"ఎలా కనిపిస్తుంది ?'' కుతూహలంగా అడిగింది వందన

''ఏదో పెద్ద త్యాగం చేస్తున్నట్లు !"

"ఎవరికోసం ?" అని పల్చని, ఎఱ్ఱని పెదవిని పంటితో నొక్కి వచ్చేనవ్వు నాపుకుంది

"మీ వాళ్ళకోసం !"

''ఊహూ అలాంటి పెద్ద పెద్ద మాటలేం ఉపయోగించకు"

''ఉన్నమాటంటే అంత ఉలుకెందుకు ?"

"అంతోటి త్యాగాలు నేను చెయ్యడంలేదు కనుక .నాకే యిష్టంలేక మానుకున్నాను''

"ఏమో ? ఎలా నమ్మడం ?''

''నమ్మకుంటే పో" నవ్వుతూ అని తల తిప్పుకుంది

"మళ్ళీ మొదటకొచ్చావు ! పోనీ ఎందుకిష్టంలేదో చెప్పు డాక్టరుగారూ ! మా సంభాషణ మీకేమీ యిబ్బంది "

''లేదు లేదు కానివ్వండి" పేపర్లోనుండి ముఖం బైటపెట్టకుండానే అన్నాడు

"ఊఁ .ఇకచెప్పు వందనా !''

"మరేమో ''

"ఊఁ "

''కట్నం లేకుండా చేసుకోను ఎవ్వరూ ఇష్టపడ్డంలేదు గనక'' బలవంతంగా నవ్వు నాపుకుని అంది

"సంపాదనంతా ఏం చేస్తున్నావు ?''

"ఎంత సంపాదన ? మహా అంటే ఒక వెయ్యి కూడబెట్టే దా న్నేమో ! దాంతో పెండ్లికొడుకును కొనుక్కో గలనా ?"

డాక్టరు పేపర్లోనుండి ముఖం ఎత్తి వందన ముఖంలోని బాధచూసి, బరువుగా నిశ్వసించాడు

"పోనీ కట్నం నేనిస్తాను చేసుకొంటావా "

"ఎలా చేసుకోను ?'' చిరునవ్వుతో అంది

"ఏం ?"

"నువ్వు కొనిచ్చిన భర్తతో ఎలా సుఖపడను ?"

"వందనా ! ఎందుకలా మాట్లాడ్తావు ?''

ఇక ఉండలేక అన్నాడు చలపతి

"తమాషాకు లెండి ! మీరేం బాధపడొద్దు" వందన అన్నమాటలు నిజంగానే అందో, తమాషాకే అందో సరితాదేవిగానీ చలపతిగానీ తేల్చుకోలేక పోయారు

"అయితే ఇంతకూ నాకు పెళ్ళిచేసి పోదామని వచ్చావా ఏమిటి?"అని, గలగలా నవ్వి స్నేహితురాలి ముఖంలోకి ఆప్యాయంగా చూసింది

నవ్వుతున్నా వందన గంభీరనిర్మల ప్రశాంత కాసారాల్లాంటి కనుదోయిలో అస్పష్టంగా కదిలాడుతున్న బాధా రేఖలను సరితాదేవి గుర్తించనే గుర్తించింది

అంతటితో ఆ పస్తావన విరమించుకుంది

'పిల్లలు ఒక్కరూ కనిపించరేం ?''

పేపరు మడచి టేబిలుమీద పెట్టూ, సంభాషణ మార్చాలని ప్రయత్నించాడు చలపతి

"మీ కోసం కాచుకొని, కాచుకొని విసిగి యిప్పుడే ఆడుకొనేందుకు వెళ్ళారు పిలుస్తాను'' అంటూ లేచి పిల్లల్ని తీసికొచ్చేందుకు వెళ్ళింది వందన

రెండు నిముషాల్లో పిల్లలందరినీ వెంటబెట్టుకుని వచ్చింది వందన

డాక్టరు గారిని చూడగానే బిలబిల మంటూ ఆయన్ను చుట్టేసారు పిల్లలు

"ఉహూ.. ఇలాకాదు అందరూ వరసగా నిల్చొని ఒక్కొక్కరే నా దగ్గరకు రావాలి వందనా, వీళ్ళను వరసగా నిల్చోబెట్టు" అన్నాడు బ్యాగ్‌లో నుండి స్టెతస్కోపు తీసుకుంటూ

వందన అందర్నీ వరసగా నిల్చోబెట్టింది ఒక్కొక్కర్నీ పేరు పేరునాపిల్చి, బుజ్జగించి, డాక్టరు దగ్గరకు తీసుకొస్తోంది పరీక్షకు

మాతృ ప్రేమకూ, లాలనకూ దూరమైన ఆ పసి హృదయాలు వందన కౌగిలిలో కరగిపోతున్నాయి.

ఆ చిన్నారి ముఖాల్లో వెలిగిపోతున్న హాసరేఖలు సరితాదేవిని ఆశ్చర్య పరచాయి

వినూత్నమూ, దివ్యమూ అయిన ఏదో లోకంలో విహరిస్తున్న ట్లనిపించింది ఆమెకు

మాతృ హీనులైన యీ అనాధులకు 'మాతృప్రేమ' అంటే ఏమిటో చవిచూప గలిగే సహృదయురాలా వందన ?

వందనలో ఇంతటి విశాల హృదయముందని త నే రోజూ అనుకోలేదు

మూడేళ్ళ అబ్బాయొకడు డాక్టరు దగ్గరకు పోనంటే పోనని మంకుపట్టు పట్టాడు.

వందన వాణ్ణి ఎంతగానో లాలించి ఎత్తుకుని డాక్టరు దగ్గరకు తీసికెళ్ళి పరీక్ష చేయించింది పరీక్ష పూర్తికాగానే జేబులోనుండి చాక్లెట్లు తీసి వాడిచేతిలో పెట్టాడు చలపతి

ఒక చాక్లెట్టు విప్పి వందననోట్లో పెట్టాడువాడు

"అమ్మంటే వాడికంత ప్రేమ !" ఆర్ద్రమైన హృదయంతో అన్నాడు డాక్టరు.

సరితాదేవి హృదయం మధుర, మంజుల లలిత సంగీతం పాడినట్లే అయింది.

మరో అరగంటకల్లా పిల్లల్నంతా పరీక్షించడం పూర్తిచేశాడు చలపతి

వందన లోపలికెళ్ళి మూడుగ్లాసుల్లో లైమ్‌జ్యూస్ తెచ్చింది

"మా ఆశ్రమానికి మీరు చేస్తున్న నిష్కామ సేవకు మేము యివ్వగలిగిందల్లా యీ నిమ్మరసమే డాక్టరుగారూ !" డాక్టరు ముందు గ్లాసు వుంచుతూ అంది వందన.

"అదే చాలు ! నే నొక్కణ్ణే కొండలు పిండిచేయుడంలేదే ! ఒకరినొకరు పొగడు కోవడ మౌతుందిగానీ, నువ్వుచేస్తున్న నిర్విరామమైన, నిష్కామమైన సేవకు ఏం ప్రతిఫలం పొందుతున్నావో కాస్త చెప్పు ?" వందన కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు

"మీ రెప్పుడూ అలాగే మాట్లాడ్తారు డాక్టరుగారూ " అంది వందన తల మరో వైపుకు తిప్పుకుని ముఖంలోని భావాలను కనిపించనీకుండా

డాక్టరు ఫకాల్ను నవ్వి—

"సరితాదేవీ ! మీ స్నేహితురాలి ముఖారవిందాన్ని కాస్త వీక్షించండి ! ఉన్నమాట చెప్పినందుకు ఎంతగా సిగ్గుపడిపోతుందో అలా ఒక్కసారి చూడండి !" అన్నాడు

"డాక్టరుగారి మాటలకేంలే సరితా ! నువ్వుముందు లైమ్‌జూస్ తీసుకో" అంది తలొంచుకునే

ముగ్గురూ లైం జూస్ తీసుకున్నారు

"ఊఁ ఇక లేవేతల్లి ! మా ఆశ్రమం చూడకుండా ఇక్కడే కూర్చుంటావా ?" అంది వందన కుర్చీలోనుండి లేస్తూ

"ఇక్కడ ఉండిపోవాలనే మరి వచ్చింది !'' వందన ముఖంలోకిచూస్తూ అంది,

"ఇక్కడే ఉండిపోతావా ! బాగుంది ! మీ శ్రీవారికి నేనేం జవాబు చెప్పను ?" ఫక్కుననవ్వి అంది

"ఆ అవసరం నీకు రాదనే అనుకుంటాను'' కళ్ళు క్రిందకువాల్చి అంది.

వందన పరీక్షగా చూసింది స్నేహితురాలి ముఖంలోకి

చలపతి కాస్త ఆశ్చర్యంగానే చూస్తూ—

''అయితే నేను విన్నవిషయం నిజం కాదుకదా ?'' అన్నాడు

"ఏం విన్నారు ?" కళ్ళెత్తి ప్రశ్నించింది

"విడాకులకోసం మీరు ప్రయత్నిస్తున్నారని"

"మీరూ నమ్మారా డాక్టర్ ?" గొంతులోబాధ మెలికలు తిరిగింది

''నొప్పిచానేమో క్షమించండి !"

"ఈ ప్రచారం బాగా సాగుతుందన్నమాట ?" విచలిత కంఠంతో అంది

డాక్టరు అందుకు సమాధానం చెప్పక మౌనంగా ఉండి పోయాడు

సరితాదేవి ముఖంలో బాధారేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి

'సరితా ?" బాష్పతప్త నయనాల్తో ప్రశ్నించింది వందన

"వందనా ! నా ఆశయాలేమిటో, నా జీవితలక్ష్యమేమిటో, నీకు బాగా తెలుసు కదూ ?"

'తెలీకేం" ?"

'కానీ నన్ను లోకం అర్థం చేసుకోలేకపోతోంది అందరూ అనుమాన దృక్కుల్తో నావైపు చూసేవారేగానీ ఒక్కరూ నన్నర్థం చేసుకుని అభినందించేవాళ్ళు లేరు నన్నుగురించి ఎలాంటి ప్రచారాలు సాగుతున్నాయో డాక్టరుగారి నడుగు, చెప్తారు" చెక్కిలిమీద జారిన కన్నీటిని తుడుచుకుని అంది

ఓ నిముషం ఎవ్వరూ ఏం మాట్లాళ్ళేదు

"వారు మటుకు నన్నర్థం చేసుకున్నట్లే వుంటుంది కానీ లోకం ఆయన మనసును కలవర పరుస్తుంది ఆరోజు శ్రీరాముడు ఎంతటి మానసికక్షోభను అనుభవించాడో యీ రోజు వారూ అంతటి బాధనే అనుభవిస్తున్నారని నాకు బాగా తెలుసు కానీ '' సరితాదేవి ఆగింది

"మరి ఆయన దగ్గరకెళ్ళక మద్రాసెందుకొచ్చావు ? అసలు గుంటూరు మటుకు ఎందుకు వెళ్ళాల్సి వచ్చింది ?"

"జీవితం చిత్రమైంది వందనా ! మరుక్షణంలో మన జీవనయాత్ర ఎలా సాగుతుందో మనకు తెలీదు. ఆ రోజు లలిత రాకుంటే బహుశా నేనీరోజు నీ ఎదుట యిలా నిలబడేదాన్ని కాదేమో !" బరువుగా నిట్టూర్చింది.

"అసలింతకూ జరిగిందేమిటి ?"

సరితాదేవి అన్ని విషయాలూ విపులంగా చెప్పింది. చివరన తప్పు తనదే అని కూడా వొప్పుకుంది.

"తొందరపడ్డావు" వందన అంది.

"అవును. మీ అభిప్రాయమేమిటి డాక్టరు గారూ ?"

"ఒక పొరపాటు చేసారు. మరొక పొరపాటు మటుకు చేయకండి" అన్నాడు.

అందుకు సరితాదేవి ఎలాంటి జవాబూ చెప్పలేదు.

మరి కాసేపటికి చంద్రశేఖరం విషయంకూడా మెల్ల మెల్లగా వినిపించింది. తనింత ఆకస్మికంగా రావడానికి చంద్రశేఖరం ప్రవర్తనకూడా ఒక కారణమే నంది. జీవితంపట్లా, ప్రపంచంపట్లా తను ఊహించుకొన్న విషయాలు చివరి కెలా పునాదుల్తోసహా కూలిపోయాయోచెప్పి విలవిల్లాడి పోయింది.

"మీ జీవితలక్ష్య మేమిటో, ఆ లక్ష్యసిద్ధికి మీ రెంతగా ప్రయత్నిస్తున్నారో అర్ధమైంది"అన్నాడు డాక్టరు.

"మీరన్నా అర్థం చేసుకున్నందుకు సంతోషం" బాధాతప్త కంఠంతో అంది.

"ఒక్క విషయం చెప్తాను. సలహా యిస్తున్నానని కోపగించుకో కండి !"

"కోపమెందుకు ? చెప్పండి"

"కోపం తెప్పించే విషయమైతే చెప్పొద్దు డాక్టరు గారూ !" నవ్వుతూ అంది వందన.

"వందన మాటలకేం ? మీరుచెప్పండి"

"మీ గమ్యం బాగుంది. కానీ దాన్ని చేరుకొనేందుకు మీ రెన్నుకున్న మార్గం సరిగ్గా లేదేమోనని నాభయం ! మాటలకన్నా చేతలకే ఎక్కువ విలువ. చేతలకూ మాటలకూ సంబంధం లేని రోజు లోకం సందేహంగా చూస్తుంది. అందుకు బాధ పడి ప్రయోజనంలేదు" దూరంగా కొండలవేపు చూస్తూ నిశ్చలంగా అన్నాడు చలపతి.

"అంటే ?" సరితా దేవి పెదవులుకొద్దిగా చలించాయి.

వందన ముఖంలో రంగులు మారాయి. త్వరపడ్డానేమోనని చలపతి కాస్త తట పటాయించాడు.

"చెప్పండి డాక్టర్!" గంభీర వదనంతో అంది.

చలపతి రెండు క్షణాలుఆగి, ఒక్కసారి సరితాదేవి కళ్ళల్లోకి చూసి, చూపులు త్రిప్పుకుని —

"వందనా, మీరూ చేరుకోవలసిన గమ్యం ఒకటే. కానీ మార్గాలే వేరని నేను ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. మీరు చూస్తూనే ఉన్నారు. వార్షికోత్సవాల్లో బహుమతులు పంచి పెట్టడం, జాతీయ ఉత్సవాలప్పుడు ఉపన్యాసాలివ్వడం, వరద బాధితులకు పోగైన పాతబట్టలు పంచిపెట్టడం, రెడ్‌క్రాస్ సొసైటీ మెంబర్‌గా ఉండటం, మహిళామండలి వార్షికోత్సవానికి అధ్యక్షత వహించడం — ఇదంతా సేవే అవుతుందా సరితాదేవీ? అందుకే లోకం సందేహంగా చూస్తుంది. అంతేకాదు, మీకు వీటివల్ల సంతృప్తీ, సంతోషమూ లభించడం లేదు"

సరితాదేవి ముఖం కొద్దిగా ఎఱ్ఱబడింది.

చలపతి అది గమనించక పోలేదు.

"మిమ్మల్ని కించపరచాలన్న భావం నాకు లేదు. నా మాటలవల్ల మీ మనసు నొప్పించి ఉంటే క్షమించండి. ఆవేదనతో అలమటించి పోతున్న మీ హృదయానికి ఉపశమనం కలిగించాలన్న ఆశతోనే యీ విషయం చెప్పడం జరిగింది"

"మీరు నిజమే చెప్పారు" కళ్ళు క్రిందకు వాల్చి అంది సరితాదేవి.

"మీరు బాధ పడ్తారని తెలుసుంటే చెప్పకనే పోదును."


"లేదు లేదు. మీరు నాకు సరైన మార్గం చూపారు. అందుకు సర్వదా కృతజ్ఞురాలను" తలెత్తి అంది.

"నాకు కాదు — వందనకు" సవరించాడు

"మధ్యలో నేను చేసిందేమిటి?"

"అలా అనకు వందనా! ఈ పసి హృదయాలమీద నువ్వు చిలకరించే ఆప్యాయతా, ఆదరణా, అనురాగమూ నన్ను నిజంగా సంతోష పరిచాయి. ప్రశాంతమైన యీ వాతావరణమూ, కల్మషంలేని యీ పసిహృదయాలూ, నిష్కామమూ, నిర్విరామమూ అయిన నీ సేవా దివ్య లోకాలను తలపింప జేస్తున్నాయి ఇక్కడే నాకూ కాస్త చోటివ్వు వందనా! నీ దగ్గరే నాకు మనశ్శాంతి లభించగలదన్న ఆశతోనే యింతదూరం వచ్చాను" తప్త కంఠంతో అంది.

వందన కళ్ళు చెమర్చాయి.



ప్రముఖ చిత్రకారులు  వీరే !"

"సరితా ! ముందు నీ సంసారం చక్కబెట్టుకో" తన కంఠంలోని బాధను పైకి తెలియనీకుండా అంది – కొంచం కఠినంగానే వందన.

"ఆ విషయం ఎత్తకు. అది ఏరోజో విచ్ఛిన్నమై పోయింది" విచలిత కంఠంతో అంది.

"అలా అనకండి సరితాదేవీ ! చూస్తూ చూస్తూ మరోతప్పు చెయ్యకండి." ప్రాధేయ పడ్డాడు చలపతి.

"లేదు డాక్టరుగారూ ! మీకు తెలీదు. అభిమానం చంపుకుని వెళ్ళినా, నిరాకరణనే స్వీకరించ వలసి ఉంటుంది. వారు ఎంత దయాపరులో, అంత కఠినులు" చెక్కిలి మీద జారిన కన్నీటిని తుడుచుకుని అంది.

"సరితా ! తీగలు తెగేవరకూ సాగదియ్యడం వివేకం కాదు. అనురాగ లత ఎంతసుకుమారమో అంత కఠినం; ఎంత సున్నితమో అంత ప్రగాఢం. అతి కోమలంగా పెంచితేనే అది వికసించి, పుష్పిస్తుంది. లేకుంటే..." వందన ఆగింది.

"తెలుసు వందనా ! కానీ..." తల ప్రక్కకుత్రిప్పి కళ్ళు తుడుచుకుంది సరితాదేవి.

"పోనీ పోనీ...ఆ విషయం నిదానంగా ఆలోచిద్దాం. డాక్టరుగారూ ! ఈ రోజు అందరం కలసి భోంచేద్దాం. మా ఆతిథ్యం తప్పక స్వీకరించి మరీ వెళ్ళాలి" వందన లేచి లోపలికి వెళ్ళబోతూ అంది.

"అందుకు అభ్యంతరం యేమీలేదు" చలపతి నవ్వి అన్నాడు.

"అయితే మీ రిద్దరూమాట్లాడుతూఉండండి ;నే వెళ్ళిఏదన్నాఏర్పాటుచేసివస్తాను"

"నువ్వు తినేదేదో పెట్టు. మళ్ళీ యేర్పాట్లేమిటి ?" అన్నాడు చలపతి.

"ఆదేవిటి డాక్టరుగారూ? మీరంటే సరే, పాతవాళ్ళనుకోండి. ఇన్నాళ్ళకు సరిత వొస్తే వొట్టి అన్నంమెతుకులెలా పెట్టను ?" నవ్వి అంది.

''సరే సరే ; నీ యిష్టం"

వందన లోపలికెళ్ళింది.

''వందన చేస్తున్న సేవలో మనం చేస్తున్న సేవ ఏపాటిది సరితాదేవీ ?" చలపతి అన్నాడు.

"అవును. ఈ రోజు వెనక్కి తిరిగి చూసుకుంటే నేను చేసినసేవ స్వల్పమనీ... అసలు పూజ్యం అనే భావమే కలుగుతుంది.''

"వంద మాటలు చెప్పడంకన్నా ఒక్క పనిచేసి చూపడం గొప్పతనం"

"మహాత్మాజీ చెప్పింది ఆదేకదా ? మీరు చెప్పకున్నా యీ అనాధాశ్రమానికి మీరు చేస్తున్న సేవ స్వల్పంగా ఏమీలేదు" సన్నగానవ్వి అంది.

"ఈ సంస్థకూ నాకూ ఉన్న బంధం క్రొత్తేమీకాదు. పది సంవత్సరాలుగా నాకు తోచిన సాయం చేస్తునే ఉన్నాను. చెప్పుకోదగినంతగా ఏమీ చెయ్యలేదు. స్వార్థం ప్రక్కనే ఉండనే ఉందిగా ?'' అంటూ నవ్వాడు.

సంధ్య మెల్లగా, విలాసంగా నడిచి వొస్తోంది. ప్రకృతి మనోజ్ఞంగా, ప్రశాంతంగా ఉంది.

దూరంగా ఉన్న కొండలు, కొండలను ముద్దు పెట్టుకుంటున్న పల్చని మబ్బులు, మనోహరంగా ఉన్నాయి. మామిడిచెట్లక్రింద పిల్లలుఆడుకొంటున్నారు-ప్రపంచాన్నే మరచి.

సరితాదేవి ఆ రమణీయ ప్రకృతిని వీక్షించడంలో మునిగిపోయింది. ప్రకృతి కాంత సౌందర్యం అక్షయం, అద్వితీయం. ఆమె సౌందర్యాస్వాదనలో ఎన్ని రోజులు గడిపినా, ఎన్ని సంవత్సరాలు గడిపినా తృప్తి కలగదు.

విరిగిన హృదయాలనూ, వికలమైన మనసులనూ తన కౌగిలిలోకి తీసుకుని ఓదార్చగలదు. అంతటి శక్తి ఆమెకు మటుకేకలదు. అలా సాగిపోతున్నాయి సరితాదేవి ఆలోచనలు.

"ఒక్క విషయం సరితాదేవీ !" ఆమె ఆలోచనలకు అడ్డొచ్చి అన్నాడు చలపతి.

దెబ్బతిన్న హృదయాలు అందరినీ అనుమానిస్తాయి.

సూటిగా తన కళ్ళల్లోకే చూస్తున్న చలపతి కళ్ళల్లోకి చూడగానే సరితాదేవి గుండెలు వేగంగానే కొట్టుకున్నాయి.

"ఏవిటి ?" అంది తన ఆలోచనలకు తనే నవ్వుకుని.

"పరధ్యానంలో ఉన్నట్టున్నారు" నవ్వి అన్నాడు.

ఆక్షణం, ఆ నవ్వు చంద్రశేఖరం నవ్వునే గుర్తుకు తెచ్చింది.

మంచివా డనుకున్న డాక్టరూ పాతబాటలోనే నడుస్తాడా ?

మగవాళ్ళంతా అంతేకాబోలు ! అదురుతున్న గుండెలను చిక్కపట్టుకుని —

"పరధ్యానమేమీ లేదు. ఏవిటో చెప్పండి" అంది.

"మరేం లేదు. నన్ను గురించి మీకు కొంచం చెప్పాలను కుంటున్నాను"

ఏవిటది ? తన కెందుకు చెప్పడం ? అయినా డాక్టరు తనకు క్రొత్తేమీ కాదే ? ఈ రోజేమి టిలా మాట్లాడుతున్నాడు ?

"నా స్థితి గతులన్నీ మీకు బాగా తెలుసు"

సరితాదేవి ఔనన్నట్లు తలూపింది.

"ఎం. బి. రెండో సంవత్సరంలో ఉండగా పెళ్ళిచేశారు. అదీ కట్నానికి ఆశ పడి ! కానీ సంవత్సరం తిరక్కముందే ఆవిడ మశూచికంతో పోయింది "

"ఊ..." సరితాదేవికి కాళ్ళూ, చేతులూ చల్లబడ్డాయి.

"ఇది జరిగి పదునైదు సంవత్సరాలుపైగా అయింది. ఇక నా గుణ గణా లంటారా ? మీకు ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. తర్వాత విషయం మీకే వొది లేస్తున్నాను" కళ్ళుదించి నేలచూపులు చూస్తూ అన్నాడు.

ఎంత సిగ్గులేని తనం ?

ఎంతటి పయోముఖం విషకుంభం !

తనమీద సానుభూతి చూపినట్లేచూపి — భగవాన్ !

"జవాబు చెప్పరేం ?"

"అంటే !" అయోమయంగా, అస్పష్టంగా గొణిగింది.

"ఇంకా అర్థం కానేలేదా ?" తలెత్తి నవ్వి అన్నాడు.

"డాక్టర్ !" కళ్ళు జ్యోతులే అయ్యాయి.

"అంత కోపమెందుకు సరితాదేవీ ! వందనకు నేను నిజంగా తగనా ?" ధీర కంపిత స్వరంతో అన్నాడు.

"డాక్టర్ !" ఆశ్చర్యానికి ప్రతిరూపమైంది. అంత ఆశ్చర్య మెందుకో చలపతికి అర్థం కాలేదు.

"వందనకు నేను తగననేఅనిపిస్తుంది. అందుకనే నా హృదయంలో మాట ఆమె ముందు ఏరోజూ పెట్టలేదు. కానీ మనసు ఉండబట్టక యీ రోజు మీ ముందు బయట పడిపోయాను: మీ అభిప్రాయమూ తెలుసుకుని వందనను అడుగుదామనుకున్నాను. కానీ యిందులో నా స్వార్థమే ఎక్కువని యిప్పుడు అనిపిస్తుంది" చేతిలు మీద పిచ్చిగా గీస్తూ తలొంచుకునే అన్నాడు.

"భగవాన్: నన్ను క్షమించు. మంచితనానికి మరోరూపమైన డాక్టర్ను గురించి ఎంత వక్రంగా ఆలోచించాను" సరితాదేవి హృదయం పశ్చాత్తాపంతో కుమిలి పోయింది.

వందన రావడంచేత ఆ ప్రస్తావన అంతటితో ముగిసింది.

భోజన మయ్యాక డాక్టరు వెళ్ళిపోయాడు. సరితాదేవి మటుకు అక్కడే ఉండి పోయింది.

* * * * *

ఆ ప్రశాంత వాతావరణంలో, వందన సహచర్యంలో తన బాధనంతా మరచిపోయి పది రోజులు గడిపింది సరితాదేవి. ఈ మధ్యలో చలపతి ఒకసారి వచ్చివెళ్ళాడు.

ఆరోజు సాయంత్రం పారిజాత చెట్టు క్రింద కూర్చుని మాట్లాడుకుంటున్నారు సరితాదేవీ, వందనా.

"అంతా విన్నావుగా? ఏమంటావు?" అంది సరితాదేవి.

వందన కళ్ళు క్రిందకువాల్చి మౌనంగా ఉండి పోయింది.

"నీముందు పొగడడం కాదుగానీ, డాక్టరు ఉత్తముడు. మీ ఇద్దరి జీవిత లక్ష్యమూ, ఆశయాలూ ఒకటే. అంగీకరించావంటే అదృష్టవంతురాలివే అవుతావు వందనా!" ఈసారీ వందన మౌనంగానే ఉండిపోయింది.

"అందంలో నీకు సరిపోని మాట నిజమే. ఆ మాత్రంచేత..."

''సరితా!'' తలెత్తి బాధాతప్త కంఠంతో అంది.

"నీ యిష్టం''

"ఇంతేనా నువ్వు నన్నర్థం చేసుకుంది?'' బాష్పతప్త నయనాలతో ఆమె ముఖంలోకి చూస్తూ అంది.

మాటల్లో పెట్టలేని భావాలన్నీ, ఆ కళ్ళల్లో ఉన్నాయి.

"వందనా! అదృష్ట వంతురాలివి! నిరీక్షణకు తగిన ఫలితమే లభించింది. నీ స్వప్నాల రాజకుమారుడేనా డాక్టరు" ఫకాల్ను నవ్వి, వంచిఉన్న వందనముఖాన్ని రెండు చేతుల్తో పైకెత్తి అంది.



"నామాట నమ్మండి, మీకొచ్చిన ఒక్క ఓటూ నేనిచ్చిందే !"

వందన ముఖం సిగ్గుతో మందారపుష్పమే అయింది

"మరి పప్పన్నం ఎప్పుడు పెడ్తారో డాక్టర్ను అడగనా" అంది

వందన దోసిట్లోనుండి తలెత్తకుండానే "అడుగు" అంది మెల్లగా

"ఈ రాయబారం జరిపినందుకు బహుమతి ఏమిటో ?" వచ్చేనవ్వు ఆపుకుంటూ అంది

"ఏం కావాలి ?" వ్రేళ్ళ సందుల్లోనుండి చూస్తూ అడిగింది

"ఏమిస్తావు ?"

"అన్నయ్యను తీసుకొస్తా !" దోసిట్లోనుండి తలెత్తి నవ్వుతూ అంది

"మంచి బహుమానమే ! అరుగో డాక్టరు ! ఆ వెనక వారే ! వందనా ! వారే ! చూడు !" మాటలు తడబడ్డాయి

వందన చిన్నగానవ్వి — "తెలుసు" అంది

"ఏం తెలుసు !" ఆశ్చర్యపోయింది

"వొస్తారని"

"ఆఁ !"

మరు నిముషంలో డాక్టరూ, జయప్రదరావూ అక్కడకు రానే వచ్చారు

జయప్రదరావూ, సరితాదేవీ ఒకరి ముఖా కరు ఒక్క క్షణంపాటు చూసుకున్నారు

జయప్రదరావు మాట్లాడిస్తాడేమోనని సరితాదేవి ఆశగా చూసింది

కానీ అలాంటిదేమీ జరగలేదు

జయప్రదరావు ముఖం కఠినంగా ఉంది

సరితాదేవి అభిమానం దెబ్బతింది

కళ్ళల్లో చివ్వున నీళ్ళు తిరిగాయి

అక్కడ నిల్చుని తన కన్నీటిని అందరికీ చూపలేక దూరంగా ఉన్న మామిడి చెట్టుదగ్గర కెళ్ళి నిల్చుంది

"అంత కఠినత్వం కూడదు" జయప్రదరావు ముఖంలోకి చురుగ్గా చూస్తూ అంది వందన

అందుకు డాక్టరూ, జయప్రదరావూ యిద్దరూ నవ్వారు

"స్నేహితురాలు ఫీజు ఎక్కువగానే యిచ్చి నట్లుంది '' అన్నాడు జయప్రదరావు

"తప్పు సరితది కాదు"

"మరైతే నాదా ?'' ఫక్కున నవ్వి ప్రశ్నించేడు

''మీకు తెలీదు '' వందన ఏదో చెప్పబోయింది

"అంతా తెలుసు"

''అంతా తెలుసా ? ఎలాగ ?"

"రమణమూర్తి ఉత్తరం వ్రాసాడు పొరపాటు తనదేననీ, సరిత కలాంటి అభిప్రాయం లేదనీ, కానీ నా దగ్గరకు రాను అభిమానపడి మద్రాసొచ్చిందనీ – వెళ్ళి తీసుకొచ్చుకోమనీ ఈ లోగా డాక్టరుగారు వ్రాసిన ఉత్తరమూ వచ్చింది " నవ్వుతూ చెప్పాడు


''మరి యింత కఠినత్వ మెందుకు ? సరితమనసునింకా కష్ట పెట్టాలనా ?" తెచ్చి పెట్టుకున్న కోపంతో అంది వందన

"వందనా ' నువ్వు నిజంగా

"పొగడ్తేనా? ఆపని తీరిగ్గా చెయ్యొచ్చు ' సరిత ఏడుస్తోంది ముందువెళ్ళి కాస్త ఓదార్చండి ! నా గురించి డాక్టరు అప్పుడే మీ చెవిలో వేశారన్నమాట ! ఇక నేను వెళ్ళి టీ తయారుచేస్తాను" అంటూ వందన లోపలకు దారితీసింది

డాక్టరు వరండాలోకెళ్ళి కుర్చీలో కూర్చుని పేపరు తిరగవెయ్య సాగాడు

జయప్రదరావు సరితాదేవి వేపు నడిచాడు



డాక్టరు - "ఇప్పుడెలా ఉంది ?"

రోగి ఆత్మ - "థాంక్స్ డాక్టర్ ! చాలా తేలికగా ఉంది !"

---

పైటచెరగుతో కన్నీళ్ళు తుడుచుకుంటోంది సరితాదేవి

జయప్రదరావు హృదయం మైనంలా కరిగిపోయింది

"సరితా !" ఆమె ముఖాన్ని తనవైపుకు త్రిప్పుకుంటూ అన్నాడు

భర్తముఖంలోకి చూస్తూ అలాగే ఉండిపోయింది కొన్ని క్షణాలపాటు సరితాదేవి

"నీకిష్టంలేనిపని నే నేరోజూ చెయ్యనని నీకుతెలీదూ ? నాదగ్గరకు రావడం నీకిష్టం లేదేమోనని నిన్ను బలవంతం చెయ్యలేదు విడాకులు తీసుకోవడం నీ కిష్టమే మోనని అందుకూ అంగీకరించాను కానీ నువ్వుయిష్టపడి వచ్చినరోజు, నా హృదయద్వారాలు నీకోసం ఎప్పుడూ తెరచే ఉంచుతానన్న విషయం ఎలా మర్చిపోయావు ?" ఆమె కళ్ళల్లోకి ప్రేమగాచూస్తూ అన్నాడు

"పొరపడ్డాను క్షమించండి!" కన్నీటిబిందువులు ముత్యాల్లా చెక్కిళ్ళమీదజారాయి

"ఇంకా కన్నీరా ?" కన్నీటిని తుడిచివేస్తూ లాలనగా అన్నాడు

"మీ హృదయ ద్వారాలను ఎప్పుడూ నా కోసం తెరిచే ఉంచుతారన్న విషయం

తెలుసుకో లేక పోయాను. ఇంత మంచి తనాన్ని అర్థం చేసుకునేపాటి గొప్పతనం నా కెక్కడుందీ ?" తప్తకంఠంతో అంది.

"నీ వెంతటి అభిమానవతివో నాకు తెలీదూ ?" నవ్వి. ఆమెను హృదయానికి దగ్గరగా తీసుకుంటూ అన్నాడు.

